సాక్షి
కర్నూలు
శనివారం ॥ 28 ॥ అక్టోబర్ ॥ 2023




## ఉమ్మడి జిల్లాకు వర్ష సూచన

ఎమ్మిగనూరురూరల్: ఉమ్మడి కర్నూలు జిల్లాలో శనివారం నుంచి నవంబర్ 1వ తేదీ వరకు చిరుజల్లులు పడే అవకాశం ఉందని వాతావరణ విభాగం శాస్త్రవేత్త మహదేవయ్య తెలిపారు.



## భ్రామరికి ఊయలసేవ

శ్రీశైలం: శ్రీభ్రమరాంబాదేవి అమ్మవారికి శుక్రవారం రాత్రి ఊయలసేవనిర్వహించారు. ఊయలలో స్వామిఅమ్మవార్ల మూర్తులను ఉంచి షోడశోపచార పూజలు చేశారు.



## చదువులమ్మ ఒడిలో..

శ్రీశైలం ప్రాజెక్ట్ ఉన్నత పాఠశాల వజ్రోత్సవాలకు ముస్తాబైంది. శని, ఆదివారాల్లో నిర్వహించే ఉత్సవాల్లో పాల్గొనేందుకు వేలాది మంది పూర్వ విద్యార్థులు తరలిరానున్నారు. 8లో▸

## న్యూస్‌రీల్

### నేడు ఉరుకుంద ఆలయం మూసివేత

కౌతాళం: పాక్షిక చంద్రగ్రహణం కారణంగా ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయాన్ని శనివారం సాయంత్రం 4గంటలకు మూసి వేస్తున్నట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వాణి, పాలక మండల చైర్మన్ నాగరాజ్‌గౌడ్ శుక్రవారం విలేకరులకు తెలిపారు. సంప్రోక్షణ, గణపతిపూజ, స్వస్తి పుణ్యాహవాచనము..తదితర ప్రత్యేక పూజల అనంతరం ఆదివారం ఉదయం ఆలయం తలుపులు తెరచి భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

### వలసల నివారణకు ప్రత్యేక ప్రణాళిక

కర్నూలు(సెంట్రల్): వలసలను నివారించేందుకు జెడ్పీ సీఈఓ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారితో కలిసి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డిని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశించారు. శుక్రవారం ఉదయం ఆమె కలెక్టరేట్ నుంచి జిల్లా అధికారులు, మండల ప్రత్యేకాధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలతో వివిధ అంశాలపై టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కోసిగి, కౌతాళం, ఎమ్మిగనూరు, నందవరం, ఆస్పరి, కోడుమూరు, గూడూరు అర్బన్, పెద్దకడబూరు మండలాల్లో గృహ నిర్మాణాల పురోగతి ఆశించినంతగా లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. చిప్పగిరి మండలంలోని డేగలహాల్, నానుచర్ల గ్రామాల్లో గ్రౌండ్ ట్రూతింగ్ పనులు శనివారంలోపు పూర్తి చేయాలని ఆదేశించారు. ఎన్నికల ఓటరు ముసాయిదా జాబితా విడుదల నేపథ్యంలో అన్ని నియోజకవర్గాల్లో రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించాలని తహశీల్దార్లకు సూచించారు. టెలీ కాన్ఫరెన్స్‌లో కర్నూలు నగర పాలక సంస్థ కమిషనర్ భార్గవ్‌తేజ, ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, కర్నూలు ఆర్‌డీఓ హరిప్రసాదు, పత్తికొండ ఆర్‌డీఓ రామలక్ష్మి, ఇన్‌చార్జి హౌసింగ్ పీడీ సిద్ధలింగమూర్తి పాల్గొన్నారు.

### నేడు వాల్మీకి మహర్షి జయంతి



కర్నూలు(అర్బన్): వాల్మీకి మహర్షి జయంతిని శనివారం ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా బీసీ సంక్షేమం, సాధికారత అధికారిణి పీ వెంకటలక్షుమ్మ తెలిపారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ సృజన ఆధ్వర్యంలో జయంతి ఉత్సవాలు జరుగుతాయన్నారు. ఉదయం 10 గంటలకు స్థానిక గౌరీ గోపాల్ హాస్పిటల్ ఎదురుగా ఉన్న వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం 11 గంటలకు జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా పరిషత్ సమావేశ భవనంలో జయంతి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ ఉత్సవాలకు జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు, వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు, విద్యార్థి సంఘ నాయకులు, బోయ/వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

**జెడ్పీ మినీ సమావేశ భవనంలో ...**

జిల్లా పరిషత్ మినీ సమావేశ భవనంలో ఉదయం 12.30 గంటలకు వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈఓ జీ నాసరరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన జరగనున్న ఈ కార్యక్రమానికి జిల్లా పరిషత్ సిబ్బంది హాజరు కావాలని కోరారు.

### 'గడప గడపకు' నిధుల వరద

కర్నూలు(అర్బన్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో ప్రజల వినతుల పరిష్కారానికి ప్రభుత్వం అదనపు నిధులను కేటాయించింది. ఇప్పటి వరకు ఒక్కో సచివాలయ పరిధిలో సీసీ రోడ్లు, డ్రైన్లు, తాగునీరు, ఇతరత్రా మౌలిక వసతులను కల్పనకు రూ.20 లక్షలను కేటాయించింది. ఈ నేపథ్యంలోనే ప్రజా ప్రతినిధుల దృష్టికి వచ్చిన సమస్యలకు పరిష్కారం చూపడంతో పాటు ఆయా గ్రామ సచివాలయాల పరిధిలో మౌలిక వసతులను మరింత మెరుగుపరిచేందుకు అదనంగా మరో రూ.20 లక్షలను కేటాయించింది. ఇందుకు సంబంధించి ప్రభుత్వ కార్యదర్శి ఎం.గిరిజాశంకర్ ఈ నెల 27న జీఓ 135 జారీ చేశారు. ఈ మేరకు జిల్లాలోని 464 గ్రామ సచివాలయాలకు రూ.92.80 కోట్లు కేటాయించారు. ఇప్పటికే ఒక్కో గ్రామ సచివాలయానికి కేటాయించిన రూ.20 లక్షల నిధులతో జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లోని గ్రామ సచివాలయాల పరిధిలో అనేక ప్రజోపయోగమైన అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. తాజాగా ప్రభుత్వం అదనపు నిధులను కేటాయించడంతో ఆయా సచివాలయాల పరిధిలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు అవకాశం ఏర్పడింది.

# నవ చరిత.. సంకల్ప స్వచ్ఛత!



ఇదిగో ఈ ఫొటో చూశారా? బిర్లాగేట్ నుంచి గుత్తి పెట్రోలు బంకు దారిలోని రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి. వంతెన కింది భాగం అపరిశుభ్రంగా ఉండేది. దీనికింద ఓ కొత్త ప్రపంచాన్ని కార్పొరేషన్ సృష్టించింది. రూ.2కోట్లతో ఖానా ఖజానా పేరుతో 14 ఫుడ్‌స్టాల్స్ ఏర్పాటు చేశారు. చిన్నపిల్లల కోసం ప్లేజోన్, వాటర్ ఫౌంటేన్ నిర్మించారు. సాయంత్రం వేళ నగరవాసులతో ఈ ప్రాంతం కిక్కిరిసిపోతోంది.

ఇది జొహరాపురం-నంద్యాల చెక్‌పోస్టు దారిలో నిర్మించిన స్పోర్ట్స్ కాంప్లెక్స్. రూ.కోటితో రెండు సింథటిక్ టెన్నిస్ కోర్టులు, నాలుగు క్రికెట్ నెట్స్ ఫ్లడ్‌లైట్‌లతో నిర్మించారు. అక్కడే రూ.1.30కోట్లతో షటిల్‌బ్యాడ్మింటన్ ఇండోర్‌స్టేడియం అందుబాటులో ఉంది. వెంకటరమణ కాలనీలోని వీనస్ కాలనీలో మరో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి టెండర్లు పిలిచారు. నగరవాసులకు అన్ని రకాల క్రీడలను అందుబాటులోకి తెచ్చి పిల్లలను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నారు.





ఈ ఫొటోలో కన్పిస్తోంది హాకర్స్‌జోన్. వినాయకఘాట్ సమీపంలో ఏ క్యాంపునకు వెళ్లేదారిలో రూ.30లక్షలతో వీటిని ఏర్పాటు చేశారు. తోపుడుబండ్ల వ్యాపారులు ఎండ, వానతో పాటు రోడ్డుపై రోజంతా నిల్చుని ఇబ్బందులు పడకుండా కార్పొరేషన్ వీటిని ఏర్పాటు చేసింది. తోపుడుబండ్లు, ఫుట్‌పాత్ వ్యాపారులు వీటిలో స్వేచ్ఛగా వ్యాపారాలు చేసుకోవచ్చు.

... ఇవే కాదు.. కర్నూలు నగర చరిత్రలో ఎప్పుడూ జరగని అభివృద్ధి ప్రస్తుతం కనిపిస్తోంది.

**కర్నూలు కార్పొరేషన్‌లో అభివృద్ధి పరుగులు**

- ప్రస్తుత పాలకవర్గంలో రూ.618.97కోట్ల వ్యయం
- మెట్రో పాలిటన్ సిటీ తరహాలో పాలకవర్గం, అధికారుల ఆలోచన
- ఖానా ఖజానా, థీమ్‌పార్క్‌లు, స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ల ఏర్పాటు
- నగరంలో చెత్త సేకరణపై ప్రత్యేక శ్రద్ధ
- ప్రజారోగ్య రక్షణకు 12 అర్బన్ హెల్త్ సెంటర్లు

సాక్షి ప్రతినిధి కర్నూలు: 2021 మార్చి 18న పాలకవర్గం ఏర్పడింది. అప్పటి నుంచి కార్పొరేషన్ పరిధిలో రూ.618.97కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. రాయలసీమలోని అతిపెద్దనగరం కావడం, మూడు రాజధానులలో కర్నూలును 'న్యాయ రాజధాని'గా అభివృద్ధి చేయాలనే నిర్ణయం నేపథ్యంలో ఇక్కడి అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. మేయర్ రామయ్య, కమిషనర్ భార్గవ్ తేజ్, ఎమ్మెల్యేలు హఫీజ్‌ఖాన్, కాటసాని రాంభూపాల్‌రెడ్డి, డాక్టర్ సుధాకర్‌లు కార్పొరేషన్ అభివృద్ధికి సమష్టిగా కృషి చేస్తున్నారు. కమిషనర్, పాలకవర్గం, ఎమ్మెల్యేలు కలిసి అభివృద్ధిపై వినూత్నంగా ఆలోచిస్తున్నారు. ఇతర రాష్ట్రాల్లో ప్రధాన నగరాలు అభివృద్ధి చెందుతున్న తీరు, ప్రజల అవసరాలు, ప్రస్తుత ట్రెండ్‌కు అనుగుణంగా నగరాన్ని 'స్మార్ట్ సిటీ'గా తీర్చిదిద్దుతున్నారు.

**'స్వచ్ఛత'లో రాష్ట్రంలో రెండోస్థానం**

టీడీపీ హయాంలో పాతబస్తీలో ఎక్కడ చూసిన చెత్తకుప్పలు పేరుకుపోయి అపరిశుభ్రంగా ఉండేది. ఇప్పుడు నగరంలో ఏ వార్డులో కూడా చెత్త కుప్పలు కన్పించవు. 53 వాహనాలు, 6 కాంపాక్టర్లలతో ఇంటింటికీ చెత్తసేకరణ చేస్తూ నగరాన్ని 'స్వచ్ఛ నగరంగా' అభివృద్ధి చేశారు. తిరుపతి తర్వాత రాష్ట్రంలో రెండో స్వచ్ఛ నగరంగా కేంద్ర ప్రభుత్వం నుంచి అవార్డును కూడా పాలకవర్గం తీసుకుంది.



నగరవాసులను ఆకట్టుకుంటున్న సైన్స్ పార్కు

**నగరంలోని అభివృద్ధి కార్యక్రమాల్లో మరికొన్ని**

- ➡ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ల పేరుతో రూ.13.20కోట్లతో 12 కొత్త వాటిని నిర్మించింది. ఆయా వార్డుల పరిధిలో ప్రజలకు వైద్యం అందుబాటులోకి తెచ్చింది.
- ➡ నగరంలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు రూ.82కోట్లతో సుంకేసుల నుంచి మునగాలపాడు వరకూ పైపులైన్.
- ➡ మునగాలపాడులో విలీన గ్రామాలకు మంచినీటిని అందించేందుకు రూ.5 కోట్లతో 15ఎంఎల్‌డి మంచినీటి శుద్ధి కేంద్రాల ఏర్పాటు.



స్ఫూర్తి నింపే దండి మార్చ్ విగ్రహం

- ➡ రూ.34కోట్లతో మన బడి-నాడు నేడు కింద మునిసిపల్ స్కూళ్లకు ఆధునిక హంగులు.
- ➡ రూ.15.40 కోట్లతో వార్డుల్లో 342 అభివృద్ధి పనులు.
- ➡ 15వ ఆర్థిక సంఘం నిధులతో రూ.45 కోట్లతో నగరంలో సుందరీకరణపనులు. గుత్తి పెట్రోల్ బంకు వద్ద గ్లోబ్, బిర్లా కాంపౌండ్ సమీపంలో దండిసత్యాగ్రహం విగ్రహం, రాజ్‌విహార్ సర్కిల్‌లో లైటింగ్‌తో పాటు పలు సర్కిళ్లను ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు.
- ➡ జొహరాపురం వద్ద రూ.11 కోట్లతో వంతెన నిర్మించి హైమాస్ లైట్ల ఏర్పాటు.
- ➡ కల్లూరు ఐటీసీ సర్కిల్ వద్ద రూ.34 కోట్లతో ఫ్లైఓవర్ బ్రిడ్జి పూర్తి.
- ➡ నగరంలో 119 కిలోమీటర్ల పరిధిలో డివైడర్లకు రంగులు, ఆకర్షణీయమైన బొమ్మలు వేసేందుకు రూ.50 లక్షలు వ్యయం.
- ➡ రూ.8 కోట్లతో తడిచెత్త, పొడిచెత్త పేరుతో బయో మైనింగ్ పనులు.
- ➡ కొండారెడ్డి బురుజు వద్ద రూ.3 కోట్లతో ఆధునికీకరణ పనులు.
- ➡ అమృత్ పథకం కింద రూ.252 కోట్లతో తాగునీటి పథకాల అభివృద్ధి.

నగరంలో 136 పార్కులు ఉన్నాయి. నగర ప్రజలకు ఆహ్లాదకర వాతావరణాన్ని అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం వీటిని అభివృద్ధి చేస్తోంది. తొలి విడతలో 15 పార్క్‌లను 'థీమ్ పార్క్'లుగా అభివృద్ధి చేశారు. రూ.2కోట్లతో ఎస్‌బీఐ కాలనీలో మ్యూజిక్ పార్క్, రూ.2కోట్లతో గఫూర్ నగరలో సైన్స్ పార్క్, రూ.2కోట్లతో డాక్టర్స్ కాలనీలో కల్చరల్ పార్క్, రూ.2కోట్లతో ఏ.క్యాంపు చాణక్యపురి కాలనీలో కార్టూన్ బేస్డ్ థీమ్ పార్క్‌లను అందుబాటులోకి తీసుకొచ్చారు.

**ముఖ్యమంత్రి చొరవతోనే అభివృద్ధి**



కర్నూలును స్మార్ట్‌సిటీగా అభివృద్ధి చేస్తామని 2014లో చెప్పి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఐదేళ్లలో కనీసం ఎన్నికలకు వెళ్లేందుకు కూడా భయపడ్డారు. మేం అధికారంలోకి వచ్చిన తర్వాత నీరు, రోడ్లు, సర్కిళ్లు, పార్కులు, స్పోర్ట్స్ కంప్లెక్స్‌లు అభివృద్ధి చేస్తున్నాం. నిధుల విడుదలలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవ, ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథరెడ్డి సహకారం మరువలేనిది.

– బి.వై.రామయ్య, మేయర్

**ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారు**



నగరంలో అన్ని పార్కులు అద్భుతంగా తీర్చిదిద్దారు. నేను డాక్టర్స్ కాలనీలోని సంస్కృతి థీమ్ పార్కుకు వెళ్తుంటాను. గతంలో పార్కు అధ్వానంగా ఉండేది. ఇప్పుడు చూస్తే ఎంతో ఆహ్లాదకరం స్వాగతం పలుకుతోంది. పచ్చని గడ్డి, చెట్లు మంచి వాతవరణం కనిపిస్తోంది. ప్రత్యేకంగా యోగా, వాకింగ్ ట్రాక్‌లు ఏర్పాటు చేశారు. ఓపెన్ జిమ్ ప్రతి ఒక్కరికీ ఉపయోగకరం.

– భాస్కర్‌రెడ్డి, రాంరహీమ్ నగర్, ఐటీసీ సర్కిల్

# ప్రజల ఆరోగ్యానికి 'సురక్ష'




జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లను అందజేస్తున్న మంత్రి గుమ్మనూరు జయరాం

ఆస్పరి: ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని అమలు చేస్తున్నారని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. మండలంలోని చిన్నహోతూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని మంత్రి పరిశీలించారు. డాక్టర్లు, రోగులతో మాట్లాడారు. వైద్య శిబిరంలోనే రక్త పరీక్ష, బీపీ చెక్ చేయించుకున్నారు. అనంతరం సర్పంచ్ హరికృష్ణ అధ్యక్షతన నిర్వహించిన సభలో మంత్రి మాట్లాడుతూ.. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో ప్రజల ఆరోగ్యంపై ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారన్నారు. ప్రతి ఒక్కరికీ మంచి చేస్తున్న వైఎస్ జగన్‌కు ప్రజలు అండగా ఉండాలన్నారు. అంతకు ముందు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను మంత్రి పరిశీలించారు. రోగులకు సురక్ష కిట్లను పంపిణీ చేశారు. వైద్య శిబిరంలో 350 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులను అందజేసినట్లు డాక్టర్ మారుతికుమార్ తెలిపారు. డాక్టర్లు కల్పన, శాంతి, మాధవీలత, గీతాకుమారి వైద్య సేవలు అందించారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నేత గుమ్మనూరు నారాయణస్వామి, దేవనకొండ జెడ్పీటీసీ సభ్యుడు కిట్టు, జేసీసీ మండల చైర్మన్ బసవరాజు , మండల సొసైటీ చైర్మన్ కట్టెల గోవర్ధన, ,సొసైటీ సీఈఓ ఆశోక్, సీడీపీఓ నిర్మలా దేవి, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రకాష్, తిమ్మప్ప, నాయుడు తదితరులు పాల్గొన్నారు.



ఇనుప గొలుసును తెంచుతున్న దృశ్యం

## క్రీడోత్సవం.. భక్తిభావం

తనువును ఊగిస్తూ దమరుక నాదాలు.. మనసును రంజింపజేస్తూ పిల్లగ్రోవి ఈలలు.. గొరవయ్యల నృత్యాలతో దేవరగట్టు హోరెత్తింది. దసరా బన్ని ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం గొరవయ్య గొలుసు తెంపే కార్యక్రమం ఉత్కంఠగా సాగింది. మాళమల్లేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాల ఎదుట వసంతోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. భారీగా తరలివచ్చిన భక్తజన సందోహం మధ్య ఆచారాన్ని పాటిస్తూ కంకణ విసర్జన కార్యక్రమాన్ని జరిపారు.

- వివరాలు 8లో▸

# మహిళా ఓటర్లే అధికం

- స్పెషల్ సమ్మరీ రివిజన్–2024 ఓటరు ముసాయిదా జాబితా విడుదల
- జిల్లాలో 19,71,325 మంది ఓటర్లు,
- డిసెంబర్ 9 వరకు అభ్యంతరాల స్వీకరణ
- జనవరి 5న తుది ఓటర్ల జాబితా ప్రకటన



కర్నూలు(సెంట్రల్): జిల్లాలో మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. కోడుమూరు, ఆలూరు, పత్తికొండ మినహా మిగతా అన్ని నియోజకవర్గాల్లో వీరి సంఖ్య ఎక్కువగా ఉంది. ఓటరు సవరణ స్పెషల్ సమ్మరీ రివిజన్–2024కు సంబంధించి ముసాయిదా జాబితాను శుక్రవారం విడుదల చేశారు. జిల్లాలో 2,186 పోలింగు కేంద్రాలు ఉండగా.. వీటి పరిధిలో 19,71,325 మంది ఓటర్లు నమోదయ్యారు. 2023 జనవరి 5వ తేదీన ప్రకటించిన తుది ఓటర్ల జాబితాలోని 19,40,628 మంది ఓటర్లతో పోల్చుకుంటే ఏడాది కాలంలో 30,697 మంది పెరిగారు. ఈ ముసాయిదా ఓటరు జాబితా జిల్లా ఎన్నికల కార్యాలయం, ఆర్‌ఓ, ఈఆర్‌ఓలు, అన్ని పోలింగ్ కేంద్రాల్లోని ప్రదర్శనకు ఉంచుతారు. ఈ జాబితాపై అభ్యంతరాలు, ఫిర్యాదులు ఉంటే డిసెంబర్ 9వ తేదీ వరకు ఇచ్చేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది.

**13,693 మంది మహిళా ఓటర్లు అధికం**

ఎస్ఎస్‌ఆర్–2024 ముసాయిదా ప్రకారం జిల్లాలో మొత్తం 19,71,325 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుష ఓటర్లు 9,78,663 మంది కాగా మహిళా ఓటర్లు 9,92,356 మంది, ఇతరులు 306 మంది ఉన్నారు. ఈ లెక్కన జిల్లాలో 13,693 మంది మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. అంతేగాక అత్యధికంగా ఓటర్లు ఉన్నా అసెంబ్లీ నియోజకవర్గంగా పాణ్యం 3,08,035 మొదటి స్థానంలో, 2,69,771 మందితో కర్నూలు రెండోస్థానంలో, 2,53,844 మందితో మూడో స్థానంలో ఆదోని నియోజవకర్గాలు ఉన్నాయి. అతి తక్కువ ఓటర్లను కలిగిన నియోజికవర్గంగా మంత్రాలయంలో చివరి స్థానంలో నిలిచింది. మంత్రాలయం నియోజకవర్గంలో మొత్తం 1,97,728 మంది ఓటర్లు ఉన్నారు. అలాగే జిల్లాలో ఎన్‌ఆర్‌ఐ ఓటర్లు 108 మంది, సర్వీసు ఓటర్లు 1605 మంది ఉన్నారు. ఇందులో పురుషులు 1564 మంది, స్త్రీలు 41 మంది ఉన్నారు. పత్తికొండలో సర్వీసు ఓటర్లు అత్యధికంగా 400 మంది ఉండగా, అత్యల్పంగా 57 మంది మంత్రాలయంలో ఉన్నారు.

**డూప్లికేట్ ఓటర్ల తొలగింపు**

ఓటరు సవరణ సంక్షిప్త జాబితాలో భాగంగా ఓటరు జాబితాలో ఉన్న డూప్లికేట్ ఓటర్లను భారీగా తొలగించారు. జూలై 21 నుంచి ఆగస్టు 21వ తేదీ వరకు బీఎల్‌ఓలు ఇంటింటా సర్వే నిర్వహించి డూప్లికేట్ ఓటర్ల వివరాలను సేకరించారు. 2023 జనవరి 5 నుంచి 2023 సెప్టెంబర్ 12వ తేదీ వరకు జిల్లాలో మొత్తం 51,371 మంది ఓటర్లను జాబితా నుంచి తొలగించారు. ఇందులో చనిపోయిన వారు 29,111మంది, షిఫ్ట్ అయిన వారు 16,695 మంది, డూప్లికేట్ ఓటర్లు 5,565 మంది ఉన్నారు.

**ఇంటింటా తిరిగి**

జిల్లా ఎన్నికల సంఘం ఓటరు జాబితా సంక్షిప్త సవరణ–2024లోభాగంగా బూత్ లెవల్ అధికారులు ఇంటింటా తిరిగి అనుమానపు ఓటర్లపై దృష్టి సారించారు. ఒకే కుటుంబంలో పది, పదికంటే ఎక్కువ ఓటర్ల ఉన్న వివరాల సేకరణ పురోగతి ఉంది. జిల్లాలో మొత్తం 6,287 కుటుంబాలకు సంబంధించి పది కంటే ఎక్కువ ఓటర్లు ఉన్నారు. ఇప్పటి వరకు 3,270 కుటుంబాలను పరిశీలించారు. మిగిలిన 3,017 కుటుంబాల వివరాలను బీఎల్‌ఓలు పరిశీలిస్తున్నారు. ఇంటి అడ్రస్సులు లేని ఓటర్లు, చాలా కాలంగా జాబితాలో ఉన్న పేర్ల ఓటర్లకు సంబంధించి జిల్లాలో 227 కుటుంబాలు ఉండగా, ఇప్పటి వరకు 77 కుటుంబాల్లో పరిశీలన పూర్తయ్యింది. మిగిలిన 150 కుటుంబాల్లో విచారణ కొనసాగుతోంది.

**అభ్యంతరాల స్వీకరణ...**

ముసాయిదా జాబితాపై అభ్యంతరాలను స్వీకరించేందుకు ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేసింది. జాబితాలోని ఓటర్లలో అనర్హులు ఉన్నా, మరణించిన వారి పేర్లు ఉన్నా, తప్పుడు సర్టిఫికెట్లు సమర్పించిన వారు ఉన్నా, పేర్లు, ఊర్లు, నియోజకవర్గాల మార్పులు తదితర మార్పులు చేసుకోవడానికి అవకాశం ఉంటుంది. ఇందుకోసం డిసెంబర్ 09 తేదీ వరకు ఫిర్యాదులు, అభ్యంతరాలు తెలపవచ్చు. ఒక్క ఓటరు ఐదుగురు కంటే ఎక్కువ మందిపై ఒక్కసారి ఫిర్యాదు చేయవచ్చు. నవంబర్ 04, 05, డిసెంబర్ 02,03 తేదీల్లో ప్రతి బూత్‌లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ప్రజల నుంచి అభ్యంతరాలను స్వీకరిస్తారు. వచ్చిన అభ్యంతరాలను డిసెంబర్ 27వ తేదీలోపు పరిశీలించి తుది ఓటర్ల జాబితాను 2024 జనవరి 5వ తేదీన ప్రకటిస్తారు.

**పారదర్శకంగా ..**



ఓటరు ముసాయిదా జాబితా–2024ను పారదర్శకంగా విడుదల చేసినట్లు కలెక్టర్ డాక్టర్ జి.సృజన తెలిపారు. బీఎల్‌ఓలు జూలై 21 నుంచి ఆగస్టు 21వతేదీ వరకుఇంటింటా తిరిగి విచారణ చేసినట్లు చెప్పారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఓటరు ముసాయిదా జాబితాపై గుర్తింపు పొందిన రాజకీయపార్టీల ప్రతినిధులతో ఆమె సమావేశం నిర్వహించారు. ముసాయిదా జాబితాపై రాజకీయ పార్టీలు క్షుణ్ణంగా పరిశీలన చేసి ఏమైనా అభ్యంతరాలు ఉంటే డిసెంబర్ 9వ తేదీలోపు ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలకు అర్జీలు ఇవ్వొచ్చన్నారు. కార్యక్రమంలో ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ మురళీ, వైఎస్ఆర్‌సీపీ నుంచి కర్నాటి పుల్లారెడ్డి, బీజేపీ నుంచి కోటీశ్వరుడు, సీపీఐ నుంచి రాజశేఖర్, బీఎస్పీ నుంచి రాజేష్ పాల్గొన్నారు.

| నియోజకవర్గం పేరు | పోలింగ్ స్టేషన్ల సంఖ్య | పురుషులు | స్త్రీలు | ఇతరులు | మొత్తం |
|---|---|---|---|---|---|
| కర్నూలు | 258 | 1,31,352 | 1,38,384 | 35 | 2,69,771 |
| పాణ్యం | 340 | 1,50,895 | 1,57,064 | 76 | 3,08,035 |
| పత్తికొండ | 255 | 1,10,198 | 1,09,153 | 22 | 2,19,373 |
| కోడుమూరు | 275 | 1,16,770 | 1,15,157 | 13 | 2,31,940 |
| మంత్రాలయం | 237 | 97,142 | 1,00,568 | 18 | 1,97,728 |
| ఆదోని | 256 | 1,26,764 | 1,27,032 | 48 | 2,53,844 |
| ఆలూరు | 294 | 1,26,112 | 1,23,361 | 51 | 2,49,524 |
| ఎమ్మిగనూరు | 271 | 1,19,430 | 1,21,637 | 43 | 2,41,110 |
| | 2,186 | 9,78,663 | 9,92,356 | 306 | 19,71,325 |

## క్లుప్తంగా

### పీహెచ్‌యూ టెండర్లకు నేడే ఆఖరు

కర్నూలు (న్యూసిటీ): జిల్లాలోని ఆస్పరి, పెద్దకడబూరు మండల కేంద్రాల్లో పీహెచ్‌యూ (పబ్లిక్ హెల్త్ యూనిట్లు) భవన నిర్మాణాలకు టెండర్లు వేయడానికి శనివారం ఆఖరు గడువని ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ నాగరాజు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పీహెచ్‌యూ నిర్మాణాలకు రూ.67.1 కోట్లతో టెండర్లు ఆహ్వానించామని తెలిపారు. శనివారం మధ్యాహ్నం 3:30 గంటల లోపు కాంట్రాక్టర్లు ఆన్‌లైన్‌లో టెండర్లు వేయాలని పేర్కొన్నారు.

### పదవీ కాలం పొడిగింపు


చంద్రమౌళి రెడ్డి

కర్నూలు కల్చరల్: ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డివిజనల్ మేనేజర్ డి.వి. చంద్రమౌళి రెడ్డి పదవీ కాలాన్ని మరో ఏడాది పొడిగించారు. ఈయన 2022 అక్టోబర్ 20వ తేదీన ఆంధ్రప్రదేశ్ టూరిజం, సాంస్కృతిక శాఖ నుంచి ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు వచ్చారు. డివిజినల్ మేనేజర్‌గా ఏడాది కాల పరిమితితో నియమితులయ్యారు. ఈ నెల 20వ తేదీతో పదవీ కాలం పూర్తి కావడంతో మరో ఏడాది పొడిగిస్తూ ఏపీటీడీసీ ఎండీ ఆదేశాలు జారీ చేశారు.

### సీసీ టీవీ కెమెరా అమరిక, రిపేరీలో ఉచిత శిక్షణ

కర్నూలు(అగ్రికల్చర్): కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ద్వారా కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువకులకు సీసీ టీవీ కెమెరా అమరిక, రిపేరీలో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ బి.శివప్రసాద్ తెలిపారు. నవంబర్ 8 నుంచి 13 రోజుల పాటు నిర్వహిస్తున్న శిక్షణ సమయంలో 18 నుంచి 45 ఏళ్లలోపు వయస్సు అభ్యర్థులకు ఉచిత భోజనం, హాస్టల్ వసతి కల్పిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 90007 10508 నెంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

### అప్పులబాధతో ఆత్మహత్య


సామెల్(ఫైల్)

ఎమ్మిగనూరురూరల్: అప్పుల బాధ తాళలేక ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎమ్మిగనూరు పట్టణం సోగనూరు రోడ్డులో శుక్రవారం ఈ ఘటన వెలుగు చూసింది. టౌన్ సీఐ మధుసూదన్‌రావు తెలిపిన వివరాల మేరకు.. సోగనూరు రోడ్డు ఎస్సీ కాలనీలో నివాసముంటున్న మాజీ కౌన్సిలర్ జేమ్స్ పెద్ద కుమారుడు సామెల్(44) లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈయనకు భార్య సునీత, కుమార్తెలు దానమ్మ, మీన, మిల్కీ, కీర్తన, జ్యోతి ఉన్నారు. కుటుంబ పోషణ, ఇతర అవసరాల నిమిత్తం రూ. 5 లక్షలకు పైగా బయట వ్యక్తుల దగ్గర అప్పు చేశాడు. వడ్డీ పెరిగిపోవటం, అప్పు ఇచ్చిన వారు తిరిగి చెల్లించాలని ఒత్తిడి చేయటంతో తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో అనుమానం వచ్చి కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాల్లో గాలించారు. సోగనూరు రోడ్డులోని ఖాళీ స్థలంలో పాతిన పోల్‌కు తాడుతో ఉరివేసుకొని విగతజీవిగా కనిపించాడు. పట్టణ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

# చదువులమ్మ ఒడిలో 60 ఏళ్ల పండుగ

- వజ్రోత్సవాలకు శ్రీశైలం ప్రాజెక్ట్ హైస్కూల్ సిద్ధం
- నేటి నుంచి రెండు రోజుల పాటు నిర్వహణ
- తరలివస్తున్న పూర్వ విద్యార్థులు

అక్కడ పరవళ్లు తొక్కుతున్న కృష్ణమ్మను ఒడిసిపట్టి గ్రామీణ ప్రాంతాల్లో వెలుగులు నింపేందుకు చేపట్టిన మహా సంకల్పంలో ఎందరో భాగస్వాములయ్యారు. శ్రీశైలం డ్యామ్ నిర్మాణంలో వివిధ ప్రాంతాల నుంచి ఉద్యోగాలు, జీవనోపాధి నిమిత్తం అక్కడికి చేరుకున్నారు. వారి పిల్లల కోసం అప్పుడు అక్కడో చదువుల కోవెల వెలిసింది. ఎంతో మందిని తీర్చిదిద్దింది. ఎంతలా అంటే కృష్ణా జలాలు బీడు భూములను ఎలా సస్యశ్యామలం చేశావో అలా ఇక్కడ చదువుకున్న వారు వివిధ హోదాల్లో స్థిరపడి ఎంతో మందికి స్ఫూర్తిగా నిలిచారు. వారంతా నేడు అదే చదువులమ్మ ఒడిలో మరోసారి సమ్మేళనమవుతున్నారు. వజ్రోత్సవాలు జరుపుకుంటున్న శ్రీశైలం ప్రాజెక్ట్ హైస్కూల్ గురించి ప్రత్యేక కథనం.


వజ్రోత్సవానికి సిద్ధమైన ఉన్నత పాఠశాల



ఒకరోజు ముందుగానే చేరుకున్న పూర్వ విద్యార్థులు,అవయవదాన కరపత్రం విడుదల చేస్తున్న స్పోసా చైర్మన్ లక్ష్మీనారాయణ

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం ప్రాజెక్ట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 60 ఏళ్లు పూర్తి చేసుకుని వజ్రోత్సవాలకు ముస్తాబైంది. వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు శ్రీశైలం ప్రాజెక్ట్ ఉన్నత పాఠశాల ఓల్డ్ స్టూడెంట్ అసోసియేషన్ (స్పోసా) ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేసింది. 60 ఏళ్లలో ఈ పాఠశాలలో చదువుకున్న వారందరూ ఒక వేదికపై కలవాలనే సంకల్పంతో శని, ఆదివారాల్లో రెండు రోజుల పాటు వేడుకలను నిర్వహిస్తున్నారు. సుమారు 7వేల మంది విద్యార్థులు వేడుకలకు హాజరయ్యే అవకాశం ఉంది. వారికి అవసరమైన వసతి, అల్పాహారం, భోజనం సౌకర్యాలు కల్పించేందుకు ఏర్పాట్లు చేశారు. మొదటి రోజు శనివారం ఆరు వేల మందితో (అలూమినీ యాంతం) స్పోసా గీతాన్ని పాడనున్నారు. ఈ ఆలాపన వరల్డ్‌బుక్ ఆఫ్ రికార్డ్స్ లండన్‌లో నమోదుకానుంది. ఆదివారం ఉదయం మెగా రక్తదాన, అవయవదాన శిబిరాన్ని పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేయనున్నారు. అలాగే శ్రీశైలం డ్యాం, ఉన్నత పాఠశాల, ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేసిన ఉద్యోగులను సన్మానించనున్నారు. ఈ పాఠశాలలో విద్యనభ్యసించిన విద్యార్థులంతా సంఘంగా ఏర్పడి పాఠశాల అభివృద్ధికి కృషి చేయడం, పేద విద్యార్థులను ఆదుకోవడంతో పాటు సామాజిక కార్యక్రమాల్లో భాగస్వాములై ఆదర్శంగా నిలుస్తున్నారు. పూర్వ విద్యార్థులు తమవంతుగా పాఠశాలలో మరమ్మతులు, పెయింటింగ్, సీసీ రోడ్డు నిర్మాణం వంటి పనులను చేయించారు. స్పోసా చైర్మన్, సీబీఐ మాజీ డైరెక్టర్ వీవీఎస్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో జరిగే వజ్రోత్సవ వేడుకలకు అసెంబ్లీ ఎథిక్స్ కమిటీ చైర్మన్, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పాచక్రపాణి రెడ్డి, తదితరులు ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు.

#### పాఠశాల చరిత్ర

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు సాగు, తాగునీరు, విద్యుత్ ఉత్పాదన కోసం నాటి దేశప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ 1963 జూలై 24న శ్రీశైలం డ్యాం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పనులు చేసేందుకు వివిధ ప్రాంతాల నుంచి ఉద్యోగులు, శ్రామికుల పిల్లల చదువుల కోసం నీటిపారుదల శాఖ ఉన్నత పాఠశాలను నిర్మించింది. ఉపాధ్యాయులను నియమించి వారికి జీతాలు చెల్లించడమే కాకుండా, పాఠశాల పరిపాలనను కూడా చూసుకునేది. అప్పట్లో ఏర్పడిన శ్రీశైలం డ్యాం ఈస్ట్ (కర్నూలు జిల్లా, సున్నిపెంట), శ్రీశైలం డ్యాం వెస్ట్ (తెలంగాణలోని మహబూబ్‌నగర్‌జిల్లా దోమలపెంట, ఈగలపెంట)లో నివసించే వారి పిల్లలంతా ఈ పాఠశాలలోనే చదువుకునేవారు.1982లో రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ఈ ఉన్నత పాఠశాలను విలీనం చేసుకుంది. ఎందరో ఈ పాఠశాలలో చదువుకున్న వారు అత్యున్నత అధికారులుగా, వ్యాపారవేత్తలుగా, పారిశ్రామికవేత్తలుగా ఎదిగారు. దేశ, విదేశాల్లో తమ ప్రతిభను చాటుతున్నారు. చదువుకున్న పాఠశాల, పుట్టిన ఊరి కోసం పూర్వ విద్యార్థులు సంఘంగా ఏర్పడి సహాయ, సహకారాలు అందిస్తున్నారు.

#### స్పోసా ఆధ్వర్యంలో అభివృద్ధి

శ్రీశైలం ప్రాజెక్ట్ పూర్వ విద్యార్థుల సంఘం ఏర్పడిన తరువాత ఇక్కడి ఉన్నత పాఠశాల, కళాశాలలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. రూ.1.5 కోట్లతో తరగతి భవనాల మరమ్మతులు, మెగా మెడికల్ క్యాంప్, అవయవదాన, రక్త దాన శిబిరాలను నిర్వహించారు. పేద విద్యార్థులకు గతంలో ఉచితంగా పుస్తకాలను పంపిణీ చేశారు. టీచర్ల కొరత ఉండడంతో పాఠశాలలో విద్యాకమిటీ ఆధ్వర్యంలో వలంటీర్లను నియమించి వారికి స్పోసానే జీతాలను కూడా చెల్లించింది. అంతే కాకుండా 10వేల మొక్కలను నాటి పర్యావరణంపై అవగాహన కల్పించారు.

#### పాఠశాలలో చదివి ఉన్నత స్థానాల్లో ఉన్న కొందరు..

- వీవీఎస్.లక్ష్మీనారాయణ, సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్
- జి.అశోక్‌కుమార్, ఏలూరు రేంజ్ డీఐజీ
- రామ్‌మోహన్‌రావు, తెలంగాణజెన్‌కో డైరెక్టర్
- కేవీఎస్ ప్రసాద్, పర్సనల్ సెక్రటరీ ఉపముఖ్యమంత్రి అంజాద్‌బాషా
- ఎస్.హరినాథ్, పర్సనల్ సెక్రటరీ మాజీ మంత్రి అచ్చంనాయుడు
- యు.ఇలియాజర్, జాయింట్ సెక్రటరీ, వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్, లండన్
- డాక్టర్.వరప్రసాద్, (రిటైర్డ్), డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్
- డాక్టర్.జ్యోత్స్న, (రిటైర్డ్) నిమ్స్ డైరెక్టర్
- సుధాకర్‌రెడ్డి, జిల్లా విద్యాధికారి, నంద్యాల
- ఎ.వెంకటేశ్వర్లు, వ్యాపారవేత్త
- విద్యాధరరావు, టీచర్, ఉన్నత పాఠశాల
- వైద్యులు జి.గీతా అరుణ, డి.మిరియాజి రావు, ఇన్నయ్య, స్వర్ణలత
- జి.ఎస్.రావు, ప్రముఖ సినీ రచయిత, డైరెక్టర్
- ఎ.మల్లికార్జున, సినీనటుడు

#### హెచ్‌ఎంగా ఉండటం అదృష్టం



నేను హెడ్ మాస్టర్‌గా బాధ్యతలు చేపట్టి కొంతకాలమే అయ్యింది. నా హయాంలో 60 వసంతాల వజ్రోత్సవం జరుగుతుండటం అదృష్టంగా భావిస్తున్నా. ప్రతి పూర్వ విద్యార్థి తాము చదువుకున్న పాఠశాలకు ఇలాంటి సేవలు అందిస్తే పాఠశాలలు ఎంతో అభివృద్ధి చెందుతాయి. అంతేకాకుండా వారు భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా నిలుస్తారు.
– ఈశ్వరమ్మబాయి, హెచ్‌ఎం, ఉన్నత పాఠశాల

#### సేవ చేయడం పూర్వజన్మ సుకృతమే



పుట్టినగడ్డను, చదువుకున్న పాఠశాలను, చదువు నేర్పిన గురువులను మరవొద్దు అనేది భావిభారత పౌరులకు నేనిచ్చే సందేశం. ఎపుడో చదువుకున్న పాఠశాలకు ఇలా సేవలు చేయడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నా. కలిసికట్టుగా పూర్వ విద్యార్థులు, ప్రస్తుత విద్యార్థులు, స్థానికులు పాఠశాల వజ్రోత్సవాలను జయప్రదం చేయాలని కోరుకుంటున్నా.
–డాక్టర్. యు.ఇలియాజర్, జాయింట్ సెక్రటరీ, వరల్డ్‌బుక్ ఆఫ్ రికార్డ్స్, లండన్

# క్రీడోత్సవం.. భక్తిభావం

- గొరవయ్యలతో హోరెత్తిన 'దేవరగట్టు'


సింహాసన కట్ట మీద ఉత్సవ మూర్తులు


నృత్యం చేస్తున్న గొరవయ్యలు

హొళగుంద: దేవరగట్టులో శుక్రవారం గొరవయ్యల నృత్యాలు ఆకట్టుకున్నాయి. గొలుసు తెంపే కార్యక్రమం ఉత్కంఠ రేపింది. వసంతోత్సవం వైభవంగా సాగింది. ఆచారాన్ని అనుసరిస్తూ కంకణ విసర్జన కార్యక్రమాన్ని నిర్వహించారు. జైత్రయాత్ర అనంతరం సింహాసన కట్టమీద కొలువుదీరిన మాళమల్లేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలు ఎదుట శుక్రవారం గొరవయ్యలు తమ సంప్రదాయ నృత్యాలను ప్రదర్శించారు. పిల్లనిగ్రోవి ఊదుతూ, త్రిశూలం చేతబట్టి, డమరుకాలను ఆడిస్తూ లయబద్ధంగా నృత్యం చేశారు. చాటిలతో కొట్టుకుంటూ ఉద్వేగంగా వచనాలు చెప్తూ పూనకంతో ఊగిపోయారు. పిల్ల గొరవయ్యలు దైవ వచనాలు వల్లె వేస్తూ అందుకు తగ్గట్టు హావభావాలు ప్రదర్శిస్తూ నృత్యం చేసి భక్తులను ఆశ్చర్యపరిచారు.

#### రెండు జరికలకు తెగిన గొలుసు

ఉత్సవంలో భాగంగా ఇనుప గొలుసును హాలహర్వి మండలం బల్లూరు గ్రామానికి చెందిన గొరువయ్య గాదిలింగప్ప రెండు జరికలకు తెంపాడు. మల్లప్ప గుడి ముందు ప్రతి ఏటా ఇనుప గొలుసు తెంపడం ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగా శనివారం దాదాపు 20 కేజీల బరువున్న గొలుసును రెండు జరికలకు తెంపడంతో భక్తులు గొరువయ్యను భుజాల మీదెత్తుకుని ఈలలు, కేకలు వేస్తూ ఆనందంతో నృత్యాలు చేశారు. గతేడాది 3 జరికలకు గొలుసు తెగితే ఈ ఏడాది రెండు జరికలకు తెగడం పట్ల భక్తులు సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం దేవదాసిల క్రీడోత్సవం జరిగింది. ఈ సందర్భంగా నెరణికి గ్రామానికి చెందిన ఒక సామాజిక వర్గం ప్రజలు బసివినులను ఎత్తుకుని నృత్యాలు చేశారు. అనంతరం రంగు నీళ్లను భక్తులపై చల్లి వసంతోత్సవం, కంకణ విసర్జన కార్యక్రమాలను నిర్వహించారు. మాళమల్లేశ్వర విగ్రహాలతో పాటు పల్లకీని భక్తులు ఊరేగింపుతో కొండ పైనున్న ఆలయానికి తీసుకెళ్లారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఆలూరు సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. ఆలయ ట్రస్టు బోర్డు కమిటీ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాల్లో నెరణికి, నెరణికి తండా, కొత్తపేట గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

#### నేడు ఉత్సవాల ముగింపు

మాళ మల్లేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలు శనివారం దేవరగట్టు నుంచి నెరణికి గ్రామానికి చేరుతాయి. వీధుల్లో ఊరేగింపు అనంతరం రాత్రి 12 గంటలకు గ్రామంలోని ఆలయానికి చేరడంతో ఉత్సవాలు ముగుస్తాయి.

# స్పందన అర్జీలను నిర్లక్ష్యం చేయొద్దు



అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ సృజన, మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: జగనన్నకు చెబుదాం-స్పందన అర్జీలను నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో పరిష్కరించాలని అధికారులను జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన ఆదేశించారు. శుక్రవారం కల్లూరు ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్థాయిలో జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి వినతులను జిల్లా కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్జీదారులు సంతృప్తి చెందేలా సమస్యలకు పరిష్కారాలు చూపాలన్నారు. స్థానిక సమస్యలను మండల స్థాయిలోనే పరిష్కరిస్తే జిల్లా వరకు రావలసిన అవసరం ఉండబోదన్నారు. స్వీకరించిన అర్జీలకు తప్పనిసరిగా ఎండార్స్‌మెంట్ అందజేయాలన్నారు.

#### రైతులకు ఇబ్బందులు లేకుండా రీ సర్వే చేయాలి

రైతులకు ఇబ్బందులు లేకుండా భూముల రీసర్వే చేయాలని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అధికారులకు సూచించారు. ప్రజల సమస్యల పరిష్కార నిమిత్తమే మండల స్థాయిలో కూడా జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. చిన్నటేకూరులోని రాణితోట స్థలంలో ప్రభుత్వానికి ఉపయోగపడే కార్యాలయాలు, నర్సరీలు ఏర్పాటు చేసేలా అధికారులు ప్రణాళికలు రూపొందించాలన్నారు. లక్ష్మీపురం జగన్నాథగట్టులో 2013లో పట్టాలు మంజూరైన లబ్ధిదారులకు ప్లాట్లు చూపించాలని రెవెన్యూ అధికారులను కోరారు. కార్యక్రమంలో ఆర్డీఓ హరిప్రసాద్, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, ఎంపీపీ శారద, జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# మీ పిల్లలకు ఇవే భోజనాలు పెడతారా?

- చేతకాకపోతే వెళ్లిపోండి
- కస్తూర్బా విద్యాలయ సిబ్బందిపై పత్తికొండ ఎమ్మెల్యే ఆగ్రహం


గుడ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

మద్దికెర: "మీ ఇంట్లో పిల్లలకు ఇలాంటి భోజనాలే పెడతారా? చేతకాకపోతే వెళ్లిపోండి " అంటూ పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ఆగ్రహం వ్యక్తం చేశారు. మద్దికెర కస్తూర్బా గాంధీ విద్యాలయంలో మెనూ పాటించడం లేదని పత్రికల్లో వార్తలు రావడంతో శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందించే భోజనాన్ని పరిశీలించి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 55 మంది విద్యార్థులకు 25 గుడ్లు ఎలా సరిపోతాయని ప్రశ్నించారు. ఇక ముందు ఇలా జరిగితే ఇంటికి పోవాల్సిందేనని హెచ్చరించారు. సంబంధిత ఏజెన్సీ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని సమగ్ర శిక్ష జిల్లా అధికారి వేణుగోపాల్‌కు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు ప్రతి రోజూ విద్యాలయాన్ని తనిఖీ చేయాలని సూచించారు. ఎమ్మెల్యేతో పాటు జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి, ఐడీసీ రాష్ట్ర డైరెక్టర్ ఆర్.వెంకటేశ్వర్లు, మండల కన్వీనర్ గంపల వెంకటేశులు, ఉప సర్పంచ్ ప్రమీలమ్మ, నాయకులు సీతారామిరెడ్డి, కృష్ణ, రామాంజులు ఉన్నారు.

#### విధుల నుంచి ప్రిన్సిపాల్ తొలగింపు

మద్దికెర కస్తూర్బా విద్యాలయం ప్రిన్సిపాల్ జ్యోతిని విధుల నుంచి తొలగిస్తూ సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ వేణుగోపాల్ ఆదేశాలు ఇచ్చినట్లు ఎంఈఓ రంగస్వామి తెలిపారు. కస్తూర్బా విద్యాలయాన్ని శుక్రవారం పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ఆకస్మికంగా తనిఖీ చేసి, సిబ్బంది నిర్లక్ష్యంపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అధికారులు స్పందించారు.

## అంతర్జాతీయ స్థాయి పోటీలకు పేరుసోముల విద్యార్థి


పేరుసోముల పాఠశాల క్రీడాకారులను అభినందిస్తున్న హెచ్‌ఎం శంకర్, ఉపాధ్యాయులు

సంజామల: గుంటూరు జిల్లా తెనాలిలో జరిగిన జాతీయ స్థాయి జంప్ రోప్ క్రీడలో పేరుసోముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన మనోజ్ ఆచారి ప్రతిభ చాటారు. తెనాలిలో జరిగిన అండర్-17 విభాగంలో 30 సెకండ్స్ స్పీడ్ ఈవెంట్‌లో బంగారు పథకం సాధించాడు. దీంతో డిసెంబర్ నెల బ్యాంకాక్‌లో జరిగే అంతర్జాతీయ స్థాయి జంప్ రోప్ పోటీలకు ఎంపికైయ్యారని హెచ్‌ఎం శంకర్‌రెడ్డి తెలిపారు. అలాగే ఇదే పాఠశాలకు చెందిన నందిని, వైష్ణవి ఇటీవల నంద్యాలో జరిగిన స్కూల్ గేమ్స్ జిల్లా స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలలో ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు చెప్పారు. ఈ మేరకు శుక్రవారం మనోజ్ ఆచారిని, నందిని, వైష్ణవితో పాటు వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రతాప్‌ను పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించింది.

#### కొండుపల్లె విద్యార్థిని తేజస్విని..

ఉయ్యాలవాడ: మండలంలోని కొండుపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతన్న తేజస్విని అంతర్జాతీయ క్రీడా పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు నరసింహుడు శుక్రవారం తెలిపారు. గుంటూరు జిల్లా తెనాలిలో ఈ నెల 15,16 తేదీల్లో జరిగిన జాతీయ స్థాయి జంప్‌రోప్ పోటీల్లో తేజస్విని తృతీయ స్థానంలో నిలిచిందన్నారు. డిసెంబర్ 10,11 తేదీల్లో అంతర్జాతీయ స్థాయిలో థాయిలాండ్ రాజధాని బ్యాంకాక్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటుందన్నారు. ఈ మేరకు విద్యార్థిని హెచ్‌ఎంతో పాటు వ్యాయామ ఉపాధ్యాయుడు, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

## గడువులోగా దరఖాస్తు చేసుకోవాలి

నంద్యాల(న్యూటౌన్): ఆంధ్రప్రదేశ్ జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయంలో నంద్యాలలో ఖాళీగా ఉన్న కమ్యూనిటీ మొబలైజేషన్ ఆఫీసర్ సెక్టోరల్-1 పోస్టుకు నిబంధనలు అనుసరించి పని చేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ సుధాకర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 31-10-2023 నాటికి 50 సంవత్సరాల్లోపు వయస్సు కలిగి, జిల్లాలో పని చేస్తున్న ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులు మాత్రమే అర్హులన్నారు. మండల విద్యాశాఖ అధికారుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తులను ఈనెల 31వ తేదీ జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయంలో విద్యార్హతతో కూడిన నకలు ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలన్నారు.

# మత్తు పదార్థాలపై పక్షం రోజులకోసారి తనిఖీ

- ప్రతి 15 రోజులకొకసారి పాఠశాలలు, కాలేజీ పరిసరాల్లో పోలీసులు తనిఖీలు చేయాలి


మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ జి.సృజన, చిత్రంలో ఎస్పీ కృష్ణకాంత్

కర్నూలు(సెంట్రల్): సీ బెళగల్ మండలం బురాన్‌దొడ్డి-2 పాఠశాలల సమీపంలో మత్తు పదార్థాలు విక్రయిస్తున్న దృశ్యాన్ని తాను స్వయంగా చూశానని, ఇక నుంచి ప్రతి 15 రోజులకొకసారి పాఠశాలలు, కాలేజీలు, వాటి పరిసరాల్లో తనిఖీలు నిర్వహించాలని అధికారులను జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో మత్తు పదార్థాల నియంత్రణకు సంబంధించి జిల్లా అధికారుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. .మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. మత్తు వినియోగంతో కలిగే అనర్థాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. పాఠశాలలు, కళాశాలల నోటీస్ బోర్డుల్లో పోస్టర్లను ప్రదర్శించాలన్నారు. ఎస్పీ కృష్ణకాంత్ మాట్లాడుతూ.. జిల్లాలో శ్రామికులు, కార్మికులు ఉండే ప్రదేశాలు, నిర్మానుష్యంగా ఉండే ప్రాంతాలు, పాడుబడ్డ బావులు, బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్లలో మత్తు పదార్థాల నియంత్రణ కోసం తరచూ గస్తీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 13 కేసులు నమోదు చేసి 54 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆదోని సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్, పత్తికొండ ఆర్‌డీఓ నీలవు రామలక్ష్మి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొనగా, సెబ్ అడిషినల్ ఎస్పీ కృష్ణకాంత్ పటేల్, డీటీసీ శ్రీధర్, డీఈఓ రంగారెడ్డి, డీఎఫ్ఓ పల్లె శివశంకర్‌రెడ్డి, కర్నూలు ఆర్‌డీఓ హరిప్రసాదు పాల్గొన్నారు.